ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 9 జూలై 2024

ప్రకృతి ఒడిలో గిరిజన వేడుక 8
- నేడు శీత్లా భవానీ ఉత్సవాలు

ప్రతీ రోజు వ్యాయామం చేయాలి 8

పాడి గేదెల పంపిణీ ఎప్పుడో?

- జిల్లాలో మినీ డెయిరీ పథకం లక్ష్యం 2 వేల యూనిట్లు
- వచ్చిన దరఖాస్తులు 1468
- 619 మంది లబ్ధిదారులకు రూ.8.66 కోట్ల సబ్సిడీ మంజూరు
- ఇప్పటి వరకు 263 మంది లబ్ధిదారుల గ్రౌండింగ్
- మరో 356 మంది లబ్ధిదారులకు కొనసాగుతున్న ప్రక్రియ
- ఒక్కో లబ్ధిదారుడికి రెండు పాడిగేదెలు, యూనిట్ ధర రూ.రెండు లక్షలు





(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పాడి గేదెల పంపిణీ పథకం కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పగడం లేదు. పాడి రైతులు మినీ డెయిరీ కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1468 మంది దరఖాస్తు చేసుకున్నారు. గేదెల యూనిట్ల కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లాలో పాల ఉత్పత్తిని పెంపొందించడంతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి రైతులక ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు ప్రభుత్వం పాడి గేదెల పంపిణీ పథకాన్ని 2018 ఆగస్టు 1న ప్రారంభించింది. ఇందులో భాగంగా పాడి రైతులకు 70 శాతం ప్రభుత్వ రాయితీ, 30 శాతం బ్యాంక్ రుణంతో గేదెలు అందించే విధంగా రూ.2 లక్షల యూనిట్ ధరను నిర్ణయించారు. ఇందులో సబ్సిడీ రూ.1.40 లక్షలు, బ్యాంక్ రుణం రూ.60 వేలు ఉంటుంది. జిల్లాలో 2 వేల యూనిట్లను అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటి వరకు కేవలం 263 యూనిట్లను మాత్రమే లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేశారు. మిగతా లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

● 1468 మంది పాడి రైతుల దరఖాస్తు

జిల్లాలో పాడి గేదెల పథకం కింద 2 వేల యూనిట్లు లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక యూనిట్ వ్యయం రూ.2 లక్షలు నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ 70 శాతం కింద రూ.1.40 లక్షలు, లబ్ధిదారుల వాటా కింద బ్యాంక్ రుణం 30 శాతం రూ.60 వేలు అందిస్తారు. జిల్లాలో ఈ పథకం కోసం లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా 1468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1139 దరఖాస్తులు ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా బ్యాంక్‌కు వెళ్లాయి. జిల్లాలోని వివిధ బ్యాంక్‌లు 619 దరఖాస్తులను పరిశీలించగా 263 యూనిట్లకు గ్రౌండింగ్ జరిగింది. 356 యూనిట్లు లబ్ధిదారులకు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో 619 యూనిట్లకు రూ.8 కోట్ల 66 లక్షల 60 వేల సబ్సిడీ మంజూరైంది. సబ్సిడీ మంజూరుకు సంబంధించి బోయినపల్లి మండలంలో 92 యూనిట్లకు రూ 12,8,80,000, చందుర్తి 21 యూనిట్లకు రూ.2,94,000, ఇల్లంతకుంట 93 యూనిట్లకు రూ.1,30, 20,000, గంభీరావుపేట 53 యూనిట్లకు రూ.74,20,000 కోనరావుపేట 56 యూనిట్లకు రూ.78,40,000 ముస్తాబాద్ 84 యూనిట్లకు రూ.11,76,40,000, రుద్రంగి 26 యూనిట్లకు రూ.36,40,000, సిరిసిల్ల మున్సిపాలిటీ 12 యూనిట్లకు రూ.16,80,000 తంగళ్లపల్లి 76 యూనిట్లకు రూ.1,06,40,000 వీర్నపల్లి 15 యూనిట్లకు రూ.21,00,000 వేములవాడ అర్బన్‌లో 6 యూనిట్లకు రూ.8,40,000, వేములవాడ మున్సిపాలిటీ ముగ్గురు యూనిట్లకు రూ.420000, వేములవాడ రూరల్ 41 యూనిట్లకు రూ.57,40,000, ఎల్లారెడ్డిపేట 41 యూనిట్లకు రూ.57,40,000 గేదెల కొనుగోలుకు సబ్సిడీ మంజూరైంది.

జిల్లాకు హర్యానా గేదేలు

జిల్లాలో 95 వేల గేదెలు, 82 వేల ఆవులు ఉన్నాయి. పాడి గేదెల పథకంలో జిల్లా లబ్ధిదారులకు హర్యానాకు సంబంధించిన గేదెలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు హర్యానా నుంచి 263 మంది లబ్ధిదారులకు గేదెలను తీసుకొచ్చి అందజేశారు. పాడి రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల గేదెలు ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోలేవ ంటున్నారు. జిల్లాలో పాడి రైతులు పాల ఉత్పత్తి ద్వారా కూడా ఉపాధి పొందుతున్నారు. డెయిరీలు, సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండల కేంద్రాల్లో హోటళ్ల, గృహ అవసరాలకు నేరుగా సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు డెయిరీ కోసం సంఘాల ద్వారా పాలు పోస్తున్నారు. గేదెల పథకంలో స్థానిక గేదెలు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్థానిక గేదెలు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందే అవకాశాలు తక్కువగా ఉంటాయని భావించి ఇతర రాష్ట్రాల గేదెలు కొనుగోలు చేస్తునట్లు చెబుతున్నారు.

జిల్లాలో యూనిట్ల లక్ష్యం, వచ్చిన దరఖాస్తులు, మంజూరు వివరాలు

మండలం	దరఖాస్తులు	గ్రౌండింగ్ యూనిట్లు...	పెండింగ్ యూనిట్లు
బోయినపల్లి	199	65	27
చందుర్తి	61	00	21
ఇల్లంతకుంట	170	38	55
గంభీరావుపేట	183	06	47
కోనరావుపేట	150	27	29
ముస్తాబాద్	149	41	43
రుద్రంగి	54	16	10
సిరిసిల్ల మున్సిపాలిటీ	27	01	05
తంగళ్లపల్లి	89	27	49
వీర్నపల్లి	22	08	07
వేములవాడ అర్బన్ మున్సిపాలిటీ	25	04	05
వేములవాడ రూరల్	93	04	37
ఎల్లా రెడ్డిపేట	146	30	21
మొత్తం	1468	263	366

రాజన్న ఆలయానికి ఆషాఢం ఎఫెక్ట్



వెలవెల బోతున్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జూలై 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆషాఢం ఎఫెక్ట్ కనిపించింది. ప్రతీ సోమవారం పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనానికి వచ్చేవారు. జూలై 5వ తేదీ నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో మొదటి వారమైన సోమవారం భక్తులు లేక బోసిపోయింది. ఆగస్టు 3వ తేదీ వరకు ఆషాఢ మాసం ఉండడంతో రాజన్న ఆలయానికి ఇదే పరిస్థితి నెలకొంటుందని అధికారులు, అర్చకులు చెబుతున్నారు.

గ్రీవెన్స్ డేతో సత్వర న్యాయం

సిరిసిల్ల క్రైం, జూలై 8: గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భూ తగాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. అసాంఘిక శక్తులు, నేరస్థులపై కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు.

ఉపాధ్యాయులు దేవుళ్లతో సమానం



వెంకంపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 8: ఉపాధ్యాయులు దేవుళ్లతో సమానంగా ఉంటారని, వారిని పిల్లలతోపాటు తల్లిదండ్రులు గౌరవించాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఉపాధ్యాయులను సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ట్యాబ్‌తోపాటు సిల్వర్‌మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు తమ అమూల్యా మైన విద్యాబోధన అందిస్తూ విద్యార్థుల్లో చదువు నేర్చుకునేలా కృషి చేస్తున్నారన్నారు. కేడీసీసీ కరీంనగర్ బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, ఎంఈవో దూస రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య పాల్గొన్నారు.

బాలసాహితీవేత్తకు ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకున్న పర్శరాములు

ఎల్లారెడ్డిపేట, జూలై 8: ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని బాలసాహిత్రీవేత్త వాసరవేణి పర్శరాములు సిద్దప్ప వరకవి విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో సిద్దప్ప వరకవి జయంతి ఉత్సవాల సందర్భంగా శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆదివారం పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. బాల సాహిత్యంలో పర్శరాములు సేవలను గుర్తించిన ట్రస్టు నిర్వాహకులు పురస్కారం అందించారు.ట్రస్టు అధ్యక్షుడు వీరయ్య, కవులు, సభ్యులు మాణిక్యం, లింగం, నాగేంద్ర, దేవేందర్, శ్రీనివాస్, రవీందర్, రమేశ్, రాజుకుమార్, చంద్రం, లక్ష్మీరాజం, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

ఎల్లారెడ్డిపేట, జూలై 8: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు కృషి చేస్తున్నారని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ టైప్, కంప్యూటర్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నిరుద్యోగులు, విద్యార్థులతో కలిసి సందర్శించారు. టైప్, కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు, యువతకు ప్రతిమ ఫౌండేషన్ వారు వివిధ కోర్సులపై ఉచిత శిక్షణను అందిస్తోందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎల్లారెడ్డిపేట, సిరిసిల్లలోని ఆదర్శ టైప్, కంప్యూటర్స్ ఇన్‌స్టిట్యూట్‌ను సంప్రదించాలని సూచించారు. తాజా, మాజీ ఎంపీటీసీ నాగరాణి, ఆదర్శ టైప్, కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ మజీద్ పాల్గొన్నారు.

వినియోగంలోకి క్రీడా ప్రాంగణం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పరికరాలను బిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జూలై 8: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని క్రీడా ప్రాంగణంలో ఆట వస్తువులు ఆడుకునేందుకు వీలుగా లేకపోవడంతో యువత ఆటలకు దూరమయ్యారు. దీనిపై ఈ నెల 1న 'ఆటలు ఆడేదెలా?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో సత్తయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ సోమవారం క్రీడా ప్రాంగణంలో వంగిపోయిన పరికరాలకు మరమ్మతు చేయించారు. పనికి రాని వాటిని తొలగించి నూతన పరికరాలను ఏర్పాటు చేసి రంగులు వేశారు. మైదానంలో పడి ఉన్న బండరాళ్లను తొలగించి క్రీడాకారులు ఆడుకునేందుకు అణువుగా తీర్చిదిద్దారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 8: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాలు అందించారు. అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాలని, ఇప్ప టివరకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వాటి వివ రాలను వచ్చే ప్రజావాణిలో అందించాలని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, త్వరితగితన పరిష్కారం చూపాపడం తోపాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో నిర్మించిన మెడికల్ కళాశాల కోసం తీసుకున్న భూములకు పరిహారం అందించాలని బాధితులు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కలిసి విన్నవించారు. 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, మెడుదుల దేవయ్యయాదవ్, మల్లేశం, పర్శరాములు, చిన్నఎల్లయ్య, నాగుల లక్ష్మీ, సలేంద్రి రాజ్యలక్ష్మీ, అశోక్, భూలక్ష్మీ, ప్రేమల, తిరుపతి, బడుగు భూమయ్య ఉన్నారు.



సమస్యలను వింటున్న కలెక్టర్

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్, పెద్దూర్ గ్రామాలు ప్రభుత్వ భూముల్లోనే ఉన్నాయని అ గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టాలన్న మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడంలేదని 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. అ భూముల్లో నిర్మాణాలను చేపట్టేందుకు ప్రజలకు పట్టాలను అందించి అనుమతులను ఇప్పించాలని కోరారు.

● వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు అందించాలని భాధితులు మహేష్, మధు, నాగరాజు, రవి, ప్రవీణ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య నియమకాల కోసం జీవోలు జారీ చేసిందని, ఆ జీవోలపై కోర్టులో స్టే కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వ లేదని పేర్కొన్నారు. జీవో నంబర్ 81పై హైకోర్టు స్టే ఎత్తివేసిందని, ఉత్తర్వులు అందించాలని కోరారు.

● కాళ్లులేకపోవడంతో ప్రభుత్వం అందించిన బ్యాటరీ సైకిల్ పని చేయడంలేదని, మూడు చక్రాల స్కూటర్‌ను అందించి న్యాయం చేయాలని కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన దివ్యాంగుడు భూమయ్య సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించాడు.

● కోనరావుపేట మండలం వట్టిమల్ల శివారులోని రంగిరాయిని చెరువు శిఖం కబ్జాకు గురైందని, దానిని రక్షించాలని రైతులు, గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. వట్టిమల్ల శివారులోని భూక్యారెడ్డితంగా, కమ్మరిపేట తండా, అజ్మీర తండా, గొల్లపల్లిని ఆనుకొని ఉన్న రంగి రాయిని చెరువు శిఖం 50 ఎకరాలు ఉండగా గ్రామానికి చెందిన కొంత మంది 45 ఎకరాల వరకు కబ్జా చేశారని, 30వరకు బోర్లు వేసి వ్యవసాయం చేసుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి కబ్జాకు గురైన భూములను రక్షిం చాలంటూ మాలోతు పంతుల్‌నాయక్, సతీష్, నారాయణ, గంగయ్య తదితరులు కోరారు.

మారుమూల పల్లెల అభివృద్ధే లక్ష్యం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- అభివృద్ధి పనులకు భూమి పూజ



స్వాగతం పలుకుతున్న మహిళలు

వీర్నపల్లి, జూలై 8 : పార్లమెంట్ పరిధిలోని మారుమూల పల్లెల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం శాంతినగర్‌లో ఎంపీ నిధులతో చేపట్టిన ఎస్టీ కమ్యూనిటీ భవనం, వన్‌పల్లిలో రెడ్డి కమ్యూనిటీ భవనం, గర్జనపల్లిలో బోరు మోటార్ నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. వీర్నపల్లి మండలంలో అన్ని గ్రామాలను ఎంపీ లాడ్స్‌తో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. అంతకుముందు కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి మారుమూల పల్లెలకు వచ్చిన బండి సంజయ్‌కి ఘన స్వాగతం పలికారు.

సమస్యలు వింటూ.. ముందుకు సాగుతూ..

వీర్నపల్లి మండలంలోని శాంతినగర్ గ్రామంలో గిరిజనుల స్వాగతంతో కొంత దూరం ర్యాలీగా నడుస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. బండ తండా, కేలోత్ తండాతోపాటు పలు గ్రామాల ప్రజలు పోడు సమస్యలు, రోడ్ల నిర్మాణం, మురికి కాలువల నిర్మాణాలపై వినతి పత్రాలు అందించారు. బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి రాణి రుద్రమ, పార్లమెంట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం లక్ష్మీ, నవీన్ యాదవ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, జిల్లా కార్యదర్శి లక్పతి నాయక్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మాలోతు ప్రకాష్ నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు బండారి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి పోతారం నరేష్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ గ్రామంలో కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం మహిళా సమాఖ్య సంఘం భవనం ప్రహరీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి వచ్చిన సందర్భంగా ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు సంఘం భవన ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించతలపెట్టిన మహిళా సమాఖ్య సంఘం భవనం ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెర్గు హన్మంతగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డ బోయిన గోపి, మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, మండల అధికార ప్రతినిధి కోల కృష్ణ, జిల్లా నాయకులు మల్లారపు సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, స్కొల్ల క్రాంతి, మెంగని మహేందర్, పద్మ, అన్నమేనేని శ్రీనివాస్‌రావు, మహేశ్‌యాదవ్, వరి వెంకటేష్, చీకోటి మహేశ్, బొల్లె హరిబాబు, శంకర్, తన్నీరు ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో గౌడ సంఘం అదనపు భవన నిర్మాణ పనులకు కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భూమి పూజ చేశారు. భవనం పూర్తయ్యే వరకు సహకారం అందించాలని గౌడ సంఘం అధ్యక్షుడు బండి సత్తయ్య విన్నవించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల అంజనేయులు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నాయకులు రెడ్డబోయిన గోపి, వెన్నమనేని శ్రీధర్‌రావు, అసాని లింగారెడ్డి, గజభీంకార్ సంతోష్, నులుగొండ శ్రీనివాస్, అసాని లావణ్య, కోడం భవిత ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న బండి సంజయ్‌కుమార్

రాయికల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

మినీ బ్రిడ్జి నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్, జూలై 8: రాయికల్ పట్టణంలో వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ వెళ్తున్న రోడ్డులో నిర్మిస్తున్న మినీ బ్రిడ్జిలను నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రాయికల్ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని సంబంధిత అధికారులను బాధ్యులుగా చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గత వారంలో షైతాపూర్ రోడ్డులో గల బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు 11 కేవీ స్తంభానికి అంటుకుని ప్రమాదపుటంచుల్లో వెళ్లిందని, వెంటనే బ్రిడ్జిలను పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కోరుట్ల, మేడిపల్లి, వేములవాడకు సంబంధించినటువంటి రవాణా కూడా ఈ బ్రిడ్జిలపై నుంచే వెళ్తూ ఉండటంతో వచ్చే వర్షాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా వాటిల్లకుండా వెంటనే నిర్మాణాలను పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా విడుదల చేసి కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, బొడుగం శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోల శంకర్, కునారపు భూమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు ఆశన్న, రామన్న, ఐటీ సెల్ అధ్యక్షుడు మోత్కూరి శ్రీనివాస్, కటకం కిషోర్, బీజేవైఎం నాయకులు బుర్ర గోపి, బంటి, బూత్ అధ్యక్షుడు రామకృష్ణ, అల్లె నర్సయ్య, శేఖర్, ఎల్లాగౌడ్, రాజేంద్రప్రసాద్, కంటె భూమేష్, ఇద్దాం గంగారెడ్డి, కట్ట రాము, నర్సయ్య పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 8: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని పెగడపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గోపగోని రాజయ్య(40) అనే గీత కార్మికుడు సోమవారం తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. రాజయ్య తలకు కాళ్లకు చేతులకు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రాజయ్యను కుటుంబసభ్యులు పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే అభివృద్ధి

- ఇక అభివృద్ధిపైనే దృష్టిపెడదాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- సిరిసిల్ల నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న బండి సంజయ్

సిరిసిల్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు అయిపోయాయి.. ఇకపై ఒకరినొకరు తిట్టుకోవడం బంద్ చేద్దాం, విమర్శలు, అరోపణలు పక్కన పెట్టి అభివృద్ధి పై ఫోకస్ చేద్దామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే అభివృద్ధి జరుగుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల, వీర్నపల్లి, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. సిరిసిల్లకు వచ్చిన బండి సంజయ్‌కు బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సిరిసిల్లలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామాలు, పట్టణాలు,



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పక్షాన సంపూర్ణ సహకారం అందించే బాధ్యత తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. కుల సంఘాల కార్యాలయాలు నిర్మిస్తే అసంఘంలోని నాయకులకే ఉపయోగపడుతుందని కానీ కుల సంఘాల తరఫున కల్యాణ మండపాలు నిర్మిస్తే ఆ కులంలోని ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని ఆలాంటి వాటికే ఎంపీ నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏ కుల సంఘం అయినా ఆ కులంలోని పేదలకు సహాయ, సహకారాలు అందిస్తూ ఆదుకున్నప్పుడే కుల సంఘాలకు మనుగడ ఉంటుందన్నారు. మీలో ఒకడిగా మున్నూరు కాపు సంఘం చేపట్టే ప్రజోపయోగ పనులకు తన వంతుగా సహకారం అందిస్తానని అన్నారు.

రెండోసారి ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో సిరిసిల్ల జిల్లా ప్రజల భాగస్వామ్యం ఉందన్నారు. రెండోసారి గెలవడం వల్లనే మోదీ కేబినేట్‌లో చోటు దక్కిందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. నిధులు తీసుకవచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్య క్షుడు దేవయ్య, పట్టణ అధ్యక్షుడు అగ్గిరాములు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కౌన్సిలర్ కల్లూరి రాజు, సంఘం ప్రతినిధులు శీలం రాజు, దుమాల శ్రీకాంత్, నీలి శంకర్, ఎరుకల ప్రకాష్, కుల్ల సత్తయ్య, నాయిని కిషన్, బాలయ్య, నర్సయ్య, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులపై తెగిపడిన విద్యుత్ వైర్లు

- గంగాధరలోని బీసీ గురుకులంలో ఘటన
- ఇద్దరు విద్యార్థులకు విద్యుదాఘాతం
- తప్పిన ప్రమాదం



చికిత్స పొందుతున్న అశ్విత్



విద్యార్థికి అయిన గాయాలు

గంగాధర, జూలై 8: విద్యుత్ తీగలపై కోతులు ఎగరడంతో వైర్లు తెగి విద్యార్థులపై పడగా విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. వైర్లు తెగిపడగానే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గంగాధరలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి నియోజకవర్గ బీసీ గురుకుల బాలుర పాఠశాల గంగాధర బ్లాకులోని ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. సోమవారం ఉదయం తరగతులకు వెళ్లేందుకు విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పాఠశాల బాత్ రూంల పైనుంచి గంగాధర, లక్ష్మీదేవి పల్లి ఎక్స్‌ప్రెస్ 11కేవీ విద్యుత్ లైను ఉంది. అయితే ప్రతి రోజు విద్యార్థులు తినగా మిగిలిన ఆహారం పక్కనే పడేస్తారు. పాఠశాల పక్కనే చెట్లపైనుంచి కోతులు ఆహారం కోసం వస్తుంటాయి. సోమవారం కోతులు 11 కేవీ వైర్లపై నుంచి ఆహారం కోసం వస్తున్న సమయంలో అవి తెగిపడ్డాయి. అప్పుడే కాలకృత్యాలు తీర్చుకుంటున్న ఆరో తరగతి విద్యార్థి ఎ అశ్విత్‌పై విద్యుత్ తీగపడింది. విద్యుత్ వైరు తెగిపడగానే సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టేసి సరఫరా నిలిచి పోయింది. విద్యార్థిపై తీగపడగా పొట్టభాగంలో, కుడిచేతిపై గాయాలయ్యాయి. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ. అశ్విత్ కాళ్లపై తీగ పడటంతో స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే సిబ్బంది వీరిద్దరినీ 108లో కరీంనగర్ తరలించారు. ప్రస్తుతం ఇద్దరికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. ఏ అశ్విత్ డిశ్చార్జికాగా మరో విద్యార్థిని డిశ్చార్జి చేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈఘటనను చూసిన మరో ఇద్దరు విద్యార్థులు స్పృహతప్పి పడిపోగా స్థానిక వైద్యశాలలో చికిత్స అందించారు.



పాఠశాల నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ లైను

నిత్య కల్యాణానికి మంగళసూత్రాలు బహూకరణ

ధర్మపురి, జూలై 8: ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో జరిగే నిత్యకల్యాణానికి హైద్రాబాద్ వాస్తవ్యులు శృత ప్రీతి, సునీత, సత్యవతి, సరిత, సరళ, రెండు జతల బంగారు సూత్రాలను సోమవారం సమర్పించారు. సుమారు నాలుగు లక్షల విలువ గల మంగళసూత్రాలు ప్రతి నిత్యం స్వామివారి కల్యాణం సమయంలో అలంకరణ కోసం కార్యాలయంలో ఈవో సంకటాల శ్రీనివాస్‌కు అందించారు. వారందరిని ఆలయ పక్షాన ఈ ఓ శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.



ఈవో శ్రీనివాస్‌కు మంగళసూత్రాలు అందజేస్తున్న దాతలు

మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు హుస్సేన్ అరెస్ట్


మహ్మద్ హుస్సేన్

జమ్మికుంట, జూలై 8: కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, సికాసా వ్యవస్థాపక కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్, అలియాస్ రమాకాంత్‌ను సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు అరెస్ట్ చేశారు. 1977లో మహ్మద్ హుస్సేన్ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2009లో జార్ఖండ్ రాష్ట్రంలో పోలీస్‌లు ఆయనను అరెస్ట్ చేశారు. జైలు జీవితం అనుభవించిన అనంతరం 2011లో జమ్మికుంటకు వచ్చారు. అప్పటి నుంచి హుస్సేన్ ఇక్కడే ఓ ఇంటిలో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆయన సోదరుడి కుమారుడు రబ్బాని ఇంటి పక్కనే ఉంటూ అలానాపాలన చూసుకుంటున్నాడు. హుస్సేన్ కొంత కాలంగా బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కంటి సమస్య తలెత్తడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కంటికి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పోలీస్‌లు సివిల్ డ్రెస్‌ల్లో మహ్మద్ హుస్సేన్ ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. నిద్రపోతున్న మహ్మద్ హుస్సేన్‌ను లేపి వెంట తీసుకువెళ్లారు. ఈ సమయంలో పక్క ఇంట్లోనే ఉంటున్న హుస్సేన్ సోదరుడి కుమారుడు రబ్బాని వచ్చి ఎవరు మీరు, ఏం కావాలి, ఎక్కడికి తీసుకు వెళ్తున్నారంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండానే తీసుకు వెళ్లారని అతడు తెలిపాడు. హుస్సేన్ వద్ద ఉదయం 11గంటల సమయంలో రబ్బాని ఫోన్‌కు పోలీసుల నుంచి ఫోన్ వచ్చింది. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి కానిస్టేబుల్‌ను మాట్లాడుతున్నానని, హుస్సేన్‌ను ఓ పాత కేసులో విచారణ నిమిత్తం తాము తీసుకు వచ్చామని, మంచిర్యాల కోర్టులో హాజరుపరుస్తామని చెప్పి ఫోన్ కట్ చేశారు. దీంతో రబ్బాని కుటుంబ సభ్యులు వెంటనే రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తెలిసింది. 1971లో హుస్సేన్- జిలానిబేగంకు వివాహం జరిగింది. ఆమె 1992లో ఉద్యమంలోకి వెళ్లింది. 1996లో గోదావరిఖనిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమెమృతి చెందింది.


హుస్సేన్ అరెస్టును చూపెడుతున్న ఏసీపీ రవికుమార్

వివరాలు వెల్లడించిన రామకృష్ణాపూర్ పోలీసులు

రామకృష్ణాపూర్, జూలై 8: మావోయిస్టు కీలక నేత మహ్మద్ హుస్సేన్ అలియాస్ సుధాకర్ అలియాస్ రమాకాంత్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నెలలుగా మావోయిస్టు, సికాస భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంతాలలో తిరుగుతున్నాడనే సమాచారంతో సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఆర్కే-1ఏ గని సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా హుస్సేన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారించగా మావోయిస్టు కరపత్రాలు, డాక్యుమెంట్లు, వాల్ పోస్టర్లు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మందమర్రికి చెందిన హుస్సేన్ ప్రస్తుతం జమ్మికుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడని, 1978 నుంచి 1981 వరకు సింగరేణి కార్మికుడిగా కెకె-2 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేశాడని తెలిపారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన

ప్రజాకవి, రచయిత మహ్మద్ హుస్సేన్ అరెస్టు అప్రజాస్వామికమని వెంటనే పోలీసులు ఆయనను విడుదల చేయాలంటూ సోమవారం రామకృష్ణాపూర్ పోలీసుస్టేషన్ వద్ద పౌర హక్కుల సంఘం, విప్లవ రచయితల, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకులు నిరసన చేపట్టారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉపాధ్యక్షులు సుచరిత, నార వినోద్, సహాయ కార్యదర్శి వినోద్, బోడ్డు రవి, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ కన్వీనర్ బాలసాని రాజమ్మ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి కన్వీనర్ గాండ్ల మల్లేశం తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తిమ్మాపూర్, జూలై8: మండలంలోని రేణికుంట గ్రామం రాజీవ్ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను సివిల్ సప్లయ్ అధికారులు, ఎల్ఎండి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా దేవునిపల్లికి చెందిన గురువయ్య అనే వ్యక్తి పలువురి వద్ద నుంచి తక్కువ ధరకు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆ బియ్యంను పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నరసింహులపేట గ్రామ శివారులో డంపు చేశాడు. డంపు చేసిన బియ్యం రెండు లారీల్లో లోడ్ చేసి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కి తరలిస్తుండగా ఖచ్చితమైన సమచారంతో రేణికుంట టోల్ ప్లాజా వద్ద సివిల్ సప్లయ్ ఆధికారులు, ఎల్ఎండి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. లారీల్లో 452.30 క్వింటాళ్లు, 11,30,750రూపాయల విలువల గల బియ్యం పట్టుకున్నారు. బియ్యంను కరీంనగర్‌లోని యంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని తరలిస్తున్న గురువయ్య, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు. లారీలను పట్టుకున్న వారిలో తిమ్మాపూర్ సిఐ కె.స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలో ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 38.90క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆదివారం అర్ధరాత్రి పోలీస్‌లు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవీందర్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

మానకొండూర్ : మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ డీలర్ సురేష్ దుకాణంలో పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేపట్టారు. దుకాణంలో 33.71 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. డీలర్ సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మీనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

● ప్రాజెక్టులోకి 3,414 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.975 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రైలు ఢీకొని ఒకరి మృతి

కోరుట్ల, జూలై 8 : కోరుట్ల పట్టణానికి చెందిన చిట్యాల నరేశ్ (32) అనే వ్యక్తిని సోమవారం రైలు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఎస్సై కథనం ప్రకారం... మతిస్థిమితం లేని నరేశ్ ఇంటి నుంచి వెళ్లగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్ రైల్వే ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు

భర్త చేతిలో భార్య హత్య

● అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం

మేడిపల్లి, జులై 8: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యను కడతేర్చాడు. మండలంలోని తొంబర్రావుపేట గ్రామానికి చెందిన రాయంచు లింగంకు కట్లకుంట గ్రామానికి చెందిన లక్ష్మి (45)తో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాలు వీరి దాంపత్యం అన్యోన్యంగా సాగింది. ఇంతలోనే లక్ష్మి గ్రామంలోనే ఒకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త లింగంకు అనుమానం కలిగింది. దాంతో వీరి మధ్య తరచూ గొడవలు మొదలయ్యాయి. లింగం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు, సంవత్సరం క్రితం సెలవుపై వచ్చి కూతురికి వివాహం చేశాడు. అనంతరం లింగం అతని కొడుకు గల్ఫ్ వెళ్లారు. ఉన్నట్టుండి లింగం హటాత్తుగా ఆదివారం సాయంత్రం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చాడు. రాత్రి బెడ్‌రూంలో నిద్రిస్తున్న తన భార్య మెడకు తాడు కట్టి ఉరివేసి ఇనుప పారతో కొట్టి హత్య చేశాడు. అనంతరం లింగం అక్కడే ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఉదయాన్నే ఇరుగుపొరుగు వారు గమనించి లింగంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యామ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 8: కరీంనగర్ జ్యోతినగర్‌లో నివాసం ఉంటున్న వ్యాపారి కట్కూరి రాజు(47) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కట్కూరి రాజు కరీంనగర్ మండలం వల్లంపహాడ్‌లో ఒక ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజులాగే ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దుకాణానికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ తరువాత రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సోమవారం ఉదయం రాజు కుటుంబ సభ్యులు రెండో ఠాణా పోలీసులకు సమాచారం అందించగా సాంకేతికతతో రాజు ఉన్న లోకేషన్‌కు వెళ్లి చూడగా అల్కాపురికాలనీలోని ఒక ఎండిపోయిన కుంట దగ్గర పురుగుల మందు తాగి చనిపోయి కనిపించాడు. మెహర్‌నగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో రాజు ఒక ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేయగా నిర్మాణం తీవ్ర జాప్యం అవుతున్నందున తరచుగా మనస్థాపం చెందేవాడని, ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య కట్కూరి విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒకరి అదృశ్యంపై కేసు నమోదు

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాకలో దొంతుల సతీష్ అనే వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి బానిసైన సతీష్ తరచూ భార్య శిరీషతో గొడవ పడేవాడు, భర్త ప్రవర్తనతో విసుగు చెందిన శిరీష తన తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం మద్యం సేవించి ఇంటికి రాగా అతిగా తాగుతుండడం, భార్యతో గొడవ పడిన విషయమై సతీష్‌ను తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తండ్రితో గొడవ పడిన సతీష్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా సతీష్ ఆచూకీ లభించలేదు. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, జూలై 8: మండలంలోని రొంపికుంటకు చెందిన ఓ యువకుడు మనస్తాపానికి గురై సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(28) అనే యువకుడికి చెందిన గొర్లు అదే గ్రామానికి చెందిన పులిపాక బొంద్యాలు అనే వ్యక్తి తోటలోని బబ్బెర చెట్లు మేశాయి. ఈ మేరకు సోమవారం ఉదయం పంచాయితీకి రావాలని అదే గ్రామానికి చెందిన కటకం రవీందర్ పిలిచారు. కానీ కొయ్యడ కుమార్ సోమవారం ఉదయం తన పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే కొయ్యడ కుమార్ ఇంటికి అదే గ్రామానికి చెందిన వీఆర్‌ఏ వెళ్లి పంచాయితీకి రావాలని చెప్పగా కుమార్ భార్య రేణుక తన భర్త పొలానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే వీఆర్‌ఏ కొయ్యడ కుమార్ పొలానికి వెళ్లి చూసేసరికి మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచాయితీకి రాకపోతే కేసు పెడుతారన్న భయంతో మనస్తాపానికి గురై తన భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు కుమార్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

● మృతుడి కళ్లు సజీవం

గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్ ఆత్మహత్యకు పాల్పడగా గ్రామానికి చెందిన కొడి అనిల్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈమేరకు నేత్రదానం చేసేందుకు మృతుడి భార్య ముందుకు వచ్చారు. కరీంనగర్ ఎల్‌వీపీ టెక్నీషియన్ గాజుల సతీష్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్‌విపి ఐ బ్యాంక్‌కు పంపారు. నేత్రదానం చేయటంపై మృతుడి భార్య, తల్లిదండ్రులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ బీష్మాచారి, ముఖ్య సలహాదారులు నూక రమేష్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

శంకరపట్నం, జూలై 8: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టులో చోటు చేసుకుంది. కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె రజిత (47) ఈ నెల 5న మధ్యాహ్నం పొలం పనులు ముగించుకొని భర్త మహేందర్‌రెడ్డి కోసం పెద్దగుట్ట దాబా హోటల్ ముందు నిలబడి ఉంది. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టింది. రజిత తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

ఆర్టీసీలో భారీగా బదిలీలు

భగత్‌నగర్, జూలై 8: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో భారీగా బదిలీలు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. మెట్‌పల్లి డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.వేదవతి హైదరాబాద్ పారుక్‌నగర్‌కు, వరంగల్-2 డిపో మేనేజర్ జి.సురేష్‌ను కరీంనగర్ బస్‌స్టేషన్ ఎటిఎంగా, కరీంనగర్ ఎటిఎం రజనీకృష్ణను లాఆఫీసర్ వరంగల్, గోదావరిఖనికి బదిలీ చేశారు. సిరిసిల్ల డిపో మేనేజర్ ఎస్.మనోహర్ కోరుట్లకు, కోరుట్ల డిపో మేనేజర్ విజయ మాధురి కరీంనగర్-1 డిపోకు, మంథని డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ జెబిఎస్ సిఆర్ఎంకు, కొత్తగూడెం అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ వివిఎస్‌కుమార్ పదోన్నతిపై మంథని డిపో మేనేజర్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న బి.శ్రీనివాస్ వేములవాడ డిపో మేనేజర్‌గా, వేములవాడలో పనిచేస్తున్న డిపో మేనేజర్ మురళికృష్ణ గద్వాల్ డిపో మేనేజర్‌గా, మెహిదీపట్నం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎ ప్రకాశ్ రావును సిరిసిల్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌ను హుజూరాబాద్‌కు, కరీంనగర్ కార్గో ఎటిఎం సదాశివ్‌ను కరీంనగర్ వర్క్‌షాపులోని టైర్స్ సెక్షన్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్‌గా, భద్రాచలం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న వి రామారావును కరీంనగర్ కార్గో ఎటిఎంగా బదిలీ చేస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 8: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం ఎల్లమ్మగుడి సమీపంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

మెట్‌పల్లి, జూలై, 8 : గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకునట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 6న మండలంలోని మేడిపల్లి శివారులో ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించాడు. అదే సమయంలో అనుమానాస్పదంగా కోరుట్ల పట్టణానికి చెందిన నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై అక్కడి వచ్చారు. పోలీసులను గమనించి ఇద్దరు యువకులు పారిపోగా కోరుట్ల పట్టణానికి చెందిన మరో ఇద్దరు మైనర్లను పట్టుకొని 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. నలుగురు యువకులు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహమ్మద్ అజార్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కోరుట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. నాందేడ్‌లో గంజాయి అమ్ముతున్న మహమ్మద్ అజార్‌ను పట్టుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి అజార్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం తీసుకొచ్చారు. మైనర్లకు వైద్య పరీక్షలు చేయించి అనంతరం ముగ్గురిని కరీంనగర్‌లోని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గంజాయి అమ్మిన, సరఫరా చేస్తున్న వారి వివరాలను పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం

కలెక్టర్ ఎదుట మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్, జూలై 8: 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన 11లక్షల రూపాయల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతి ఎదుట ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించిన రామడుగు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త జగన్‌మోహన్‌గౌడ్ ఆమె ముందే మెడకు చేతి రుమాలు చుట్టుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు ఆయనను అడ్డుకొని బయటకు తీసుకెళ్లారు. అనంతరం జగన్‌మోహన్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ చాలా కాలంగా తనకు రావలసిన బిల్లుల కోసం అధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. రూ.11లక్షల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక పోతున్నానని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తేనైనా నాకు న్యాయం జరుగుతుందని భావించానని అన్నారు. వారం క్రితం ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తన గోడు వెల్లబోసుకున్నానని, ఇప్పటికీ డబ్బులు రాలేదని జగన్‌మోహన్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మన ఊరు..మన బడి పథకంలో భాగంగా పాఠశాల అభివృద్ధి పనులు చేయించారని అన్నారు. ఈ పనులు తమకు సంబంధం లేదని, పాఠశాల అభివృద్ధి కమిటీ చేయాలని చెప్పినప్పటికీ గ్రామ కార్యదర్శి నుంచి కలెక్టర్ వరకు సర్పంచ్‌లపై తీవ్రమైన ఒత్తిడి చేశారని ఆరోపించారు. దీంతో తమ వద్ద డబ్బులు లేకపోవడంతో అప్పులు చేశామని, ఇంట్లో బంగారం, ఎకరాల భూమి అమ్ము కున్నామని వాపోయారు. అప్పులు ఇచ్చినవారు అప్పు తీర్చాలని తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, మంత్రుల చట్టు తిరిగినా బిల్లులు మంజూరు చేయడం లేదన్నారు. విసిగి వేసారి చివరకు కలెక్టర్ ఎదుట ఆత్మహత్యకు యత్నించానన్నారు. జిల్లాలోని అనేక మంది మాజీ సర్పంచులకు, ఏఎంసీ డైరెక్టర్లు, సింగిల్ విండో ఛైర్మన్లు కూడా మన ఊరు..మన బడి అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేసి వెంటనే బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని జగన్‌మోహన్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.


జగన్‌మోహన్‌గౌడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

'ప్రజావాణి'కి మందుడబ్బాతో వచ్చిన బాధితుడు

సుభాష్‌నగర్:అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తన సమస్య పరిష్కారం కావడం లేదని ఓ బాధితుడు పురుగుల మందు డబ్బా తో ప్రజావాణికి వచ్చాడు. అయితే పోలీసుల తనిఖీలో ఆయన వద్ద పురుగుల మందు డబ్బా ఉందని గుర్తించి దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాధితుడు ఒగ్గు రాజమల్లు మాట్లాడుతూ తాను గంగాధర మండలం, సర్వారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడనని, తనకు గ్రామంలో 58 సర్వే నంబ రులో 24 గుంటలు, 59 సర్వే నంబరులో 26 గుంటల భూమి, 447లో 22 గుంటల భూమి ఉందని తెలిపారు. 2005లో కొంత భూమిని తన తండ్రి నుంచి విరాసత్ ద్వారా పొందినట్లు చెప్పారు. ఆ భూమిని తానే సాగు చేస్తున్నానని తెలిపారు. అయితే ఈ భూమిని తాను కాని, తన కుటుంబ సభ్యులు కానీ ఎలాంటి క్రయ విక్రయాలు చేయలేదన్నారు. అయితే పట్టా భూమి పొరపాటున ఇతరుల పేరున ధరణి పోర్టల్‌లో నమోదు అయిందని తెలిపారు. దానిని సరి చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. ధరణిలో అక్ర మంగా తన భూమిపై ఉన్న ఇతరుల పేరును వెంటనే తొలగించాలని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం 1వ టౌన్ సీఐ సరిలాల్ రాజమల్లు దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం రాజమల్లు కలెక్టర్ పమేలా సత్పతికి దరఖాస్తు అందజేసి వెళ్లిపోయారు.


ఒగ్గు రాజమల్లు దంపతులు

కొనసాగుతున్న ఎన్టీపీసీ స్పోర్ట్స్ మీట్

జ్యోతినగర్, జులై 8 : రామగుండం ఎన్టీపీసీలో దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ రెండోరోజు సోమవారం ఉత్సాహంగా కొనసాగింది. ఎన్టీపీసీ పీటీఎస్ స్పందన ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ పోటీలలో రెండో రోజు సింహాద్రి ఎన్టీపీసీ మహిళల జట్టు లీగ్ మ్యాచుల్లో విజయం సాధించింది. మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన క్రికెట్ లీగ్ మ్యాచుల్లో ఎస్ఆర్‌హెచ్‌క్యూ(హైదరాబాద్) వల్లూర్ ప్రాజెక్టు జట్టుపై 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో సింహాద్రి ఎన్టీపీసీ జట్టు కుడిగి ఎన్టీపీసీ జట్టుపై 13 పరుగుల తేడాతో గెలుపొందింది. ఎన్టీపీసీ సదరన్ స్పోర్ట్స్ మీట్ బుధవారం ముగుస్తుంది.

వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం

హత్య చేసి బావిలో పడేశారని అనుమానం


ముత్తారం, జూలై 8: ముత్తారం మండలంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. గోనే సంచిలో మృతదేహం మూట కట్టి ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసి మూటగట్టి బావిలో పడేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన మూడు రోజుల క్రితం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మండలంలోని ముత్తారం నుంచి పారుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మూట కట్టి ఉన్న గోనె సంచి నీళ్ల పైకి తేలి దుర్వాసన రావడంతో అటువైపుగా వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను పైకి తీయించి పరిశీలించగా అందులో ఒక మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న మంథని సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. ఆ మృతదేహం ఎవరిది అనే విషయమై పోలీసులు ఇంకా గుర్తించలేదు. ఇటీవల ఒక మహిళ అదృశ్యం అయినట్లు గోదావరిఖని పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఆ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఎవరూ గుర్తించలేకపోయారు. ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహం ఎవరిదని గుర్తించలేదన్నారు.

బీఎస్ఎన్ఎల్‌లో 4జీ సేవలు

భగత్‌నగర్, జూలై 8: ఉమ్మడి జిల్లాలో 4జీ సెల్ సైట్లను విజయవంతంగా ఏర్పాటు చేశామని కరీంనగర్ జిల్లా డిప్యూటి జనరల్ మేనేజర్ దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో స్వదేశీ పరిజ్ఞానంతో బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లను 4జీ/5జీ సిమ్‌లకు అప్‌గ్రేడ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ మొబైల్ చార్జీలను పెంచే యోచన లేదన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌తో మెరుగైన ఇంటర్నెట్ సేవల అనుభూతి పొందాలని, ఆర్సి 249 అన్‌లిమిటెడ్ కాల్స్, 2జిబి డాటాను 45 రోజుల పాటు అందిస్తున్నామన్నారు.

భీవండి నుంచి జగిత్యాలకు మద్యం సరఫరా

- 11 మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనం సీజ్
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ సీఐ


నిందితులను అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

జగిత్యాల టౌన్, జూలై 8 :మహారాష్ట్రలోని భీవండి నుంచి జగిత్యాలకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను జగిత్యాల ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 11 మద్యం బాటిళ్లతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్ పూర్తి వివరాలు వెల్లండించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామానికి చెందిన నడిమెట్ల రాజు, కొడిమ్యాల అనీల్‌లు టాక్సీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల బీవండి ప్రాంతానికి టాక్సీ కిరాయి వెళ్లి అక్కడ ఇంపీరియల్ బ్లూ కంపెనీకి చెందిన 11 మద్యం బాటిళ్లను రూ. 300 చొప్పున కొనుగోలు చేశారు. వాటిని జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో కర్రీ పాయింట్ నిర్వహించే చంద్రమౌళికి రూ. 650 చొప్పున విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం కరీంనగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ వర్రప్రసాద్, జగిత్యాల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు పొలాసలో ఉన్న కర్రీ పాయింట్‌పై దాడులు చేయగా 11 మద్యం బాటిళ్లు ఇతర ప్రాంతం నుంచి తీసుకవచ్చి విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ రాజమౌళి, ఎస్సై స్వప్న, సిబ్బంది గట్టయ్య, మోహన్ లాల్, చందు, కిషోర్, రమేష్, సంతోష్ ఉన్నారు.

విడుదల కాని 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల బిల్లులు

● అప్పులు తెచ్చి పనులు చేసిన మహిళా సంఘాల సభ్యులు


గొల్లగూడెం పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు(ఫైల్)


ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చేస్తున్న మరమ్మతు పనులు (ఫైల్)

సైదాపూర్, జూలై 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని భావించిన ప్రభుత్వం మరమ్మతు పనులను మహిళా సంఘాల ఆధ్వర్యంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనులు గుర్తించి అన్ని గ్రామాలలో ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షురాళ్ల(వీవో)కు అప్పగించింది. మహిళలు ఎంతో ఉత్సాహంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశారు. కానీ 25శాతం నిధులు మాత్రమే ఇప్పటి వరకు విడుదలయ్యాయని మహిళలు తెలుపుతున్నారు. ప్రభుత్వం త్వరగా నిధులు విడుదల చేస్తుందనే ఉద్దేశ్యంతో బంగారం తాకట్టుపెట్టి, అప్పులు తెలిచ్చి పనుల చేస్తే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిధులను వెంటనే విడుదల చేయాలని వీవోలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించి మరిన్ని పథకాలలో భాగస్వామ్యం చేయాలని, నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేశాం

- రజిత, వీవో అధ్యక్షురాలు, సైదాపూర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అప్పులు తెచ్చి మరమ్మతు పనులు చేపట్టాం. పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 25శాతం నిధులు మాత్రమే విడుదలయ్యాయి. ఇంకా 75శాతం నిధులు విడుదల కాలేదు. నిధుల మంజూరుకు ఆలస్యం అయితే అప్పుల పాలయ్యే అవకాశ ముంది. ప్రభుత్వం త్వరితగతిన నిధులు మంజూరు చేయాలి.

ఎల్లారెడ్డిపేటలో వర్షం

ఎల్లారెడ్డిపేట, జూలై 8: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వానకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు ప్రవహించింది. మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, పదిర, అక్కపల్లి, దుమాల తదితర గ్రామాల్లోని పత్తి చేలల్లో వరద నీరు చేరింది. పత్తి మొలకలు నీట మునిగాయి. ఆయా గ్రామాల్లోని నీటి వనరుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. వర్షం కురవడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.

ఎన్టీఆర్ భవన్‌కు తరలిన టీడీపీ నేతలు



హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

వేములవాడ టౌన్, జూలై 8: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసేందుకు వేములవాడ మండల టీడీపీ నాయకులు సోమవారం ఎన్టీఆర్ భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వేములవాడ నందికమాన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు చింతలకోటి రామస్వామి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సీఎంగా ప్రమాణస్వీకరం చేసిన మొదటి సారి హైదరాబాద్ వచ్చిన చంద్ర బాబు నాయుడిని కలిసేందుకు వెళ్తున్నట్లు చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని, రాజన్న ప్రసాదాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన విషయాలను చర్చిస్తామని తెలిపారు. నాయకులు వీర్నాల వెంకటేశం, అంజగౌడు, దేవయ్య, ఎర్రం రవీందర్, భాస్కర్ వెళ్లారు.

ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్

ఇల్లంతకుంట, జూలై 8: మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శ పాఠశాలలో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు భారత ఎన్నికల విధానంపై అవగాహన పెంచాలనే లక్ష్యంతో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మధూకర్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఐలను మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 8: బదిలీపై సిరిసిల్ల పట్టణ సీఐగా కే కృష్ణ, సిరిసిల్ల రూరల్ సీఐగా కే మొగిలి ఇటీవల బాధ్యతలను చేపట్టగా సోమవారం టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి, టీడీపీ పట్టణ నాయకులు మల్లేశం, తుమ్మనపల్లి సత్యం పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జూలై 8: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ టాన్స్‌ఫార్మర్‌ను సంబంధిత శాఖ అధికారులు, నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణహరి మాట్లాడుతూ గ్రామంలో లో-వోల్టేజీ సమస్యతో తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సెస్ పాటు పడుతోందన్నారు. సెస్ ఏడీ మహేందర్, ఏఈ పృథ్వీధర్, తాజా, మాజీ ఎంపీటీసీ తిరుపతిబాబు, నాయకులు నర్సయ్య, బాలయ్య, రమేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

సిరిసిల్ల రూరల్, జూలై 8: సిరిసిల్ల పట్టణానికి చెందిన పలువురు సోమవారం బీజేపీలో చేరగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన మల్లడపేట భాస్కర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం సిరిసిల్ల పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో తిరిగి భాస్కర్‌తోపాటు రాజు పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కుమ్మరి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

11న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

తంగళ్లపల్లి, జూలై 8: ఈ నెల 11న తంగళ్లపల్లి మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో మాట్లాడారు. విద్యుత్ అంతరాయం, లో వోల్టేజీ, మీటర్ రీడింగ్‌లో హెచ్చుతగ్గులు, బిల్లులు భారీగా రావడం, ఓవర్‌లోడ్, బిల్లుల పేరు మార్పిడి, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో సమస్యలు వంటివాటి పరిష్కారం వేదికలో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగంలో తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల విద్యుత్ వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. ఈ రెండు మండలాల విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చికోటి అనిల్‌కుమార్, కుసుమ గణేష్, జోగి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

సిరిసిల్ల టౌన్ జూలై 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌన్సిలర్ కల్లూరి లత భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్లూరి మధును నాఫ్‌కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్ సభ్యులు కల్లూరి రాజు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

వీర్నపల్లి, జూలై 8 : వీర్నపల్లి మండలంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్‌ను సోమవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. నీట్‌పై స్పందించాలని కోరితే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. పేపర్ లీక్ కావడంతో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

వేములవాడ రూరల్, జూలై 8: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోశెట్టిపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్, మ్యాకల బాబు, జీవన్, అభి, సంతోష్, యాకోబు, భూమయ్య, శంకర్, లక్ష్మి, బూదవ్వ, రేణుక, భారతవ్వ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ పర్యటన విజయవంతం చేయండి

చందుర్తి జూలై 8 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం సందర్భంగా చందుర్తి మండలానికి మొదటిసారిగా మంత్రి హోదాలో వస్తున్నారన్నారు. మండల ప్రజలందరూ పాల్గొని మంత్రి రాకను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వేములవాడలో నిర్వహించే కృతజ్ఞత సమావేశంలో మంత్రి సంజయ్ కుమార్ పాల్గొంటారనన్నారు. పొంచెట్టి రాకేష్,మండల ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు వంకాయల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జూలై 8 : వేములవాడ పట్టణంలో మూలవాగు బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కొంత కాలంగా పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న కనుకయ్య అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పూర్తి వివరాలు తెలిసిన వాళ్ళ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని టౌన్ సీఐ వీర్రప్రసాద్ కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చందుర్తి జూలై 8: చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పత్తిపాక లింగయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, రమేష్, మహేష్, విజయ్ యాదవ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రకృతి ఒడిలో గిరిజన వేడుక



వేడుకలను నిర్వహిస్తున్న గిరిజన మహిళలు(ఫైల్)

- నేడు శీత్లా భవానీ ఉత్సవాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 8: ఏటా ఆషాఢ మాసం మొదటి మంగళవారం నిర్వహించే శీత్లా భవానీ వేడుకలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని తండాలు సిద్ధమయ్యాయి. అటవీ ప్రాంతంలో జరిగే వేడుకలను అత్యంత వైభవంగా జరిపేందుకు గిరిజనుల అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు గిరిజన తండాలైన అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, బాకురుపల్లితండా, గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా, కిష్టునాయక్‌తండా తదితర తండాల్లో శీత్లా భవాని వేడుకలను నిర్వహించనున్నారు.

ఏడుగురమ్మలకు ప్రత్యేక మొక్కులు

బంజారాలు ఎంతో పవిత్రంగా జరుపుకునే ఉత్సవాల్లో శీత్లా భవాని వేడుక ఒకటి. ఉత్సవం నిర్వహించే రోజు తండాల్లో ప్రతి ఒక్కరూ నిష్టతో ఉంటారు. ఇంట్లో తయారు చేసిన పిండి వంటకాలను అటవీ ప్రాంతంలోకి గిరిజన సంప్రదాయ పద్ధతిలో డప్పుచప్పుళ్ల మధ్య తీసుకెళ్తారు. ఓ చెట్టు కింద ఏడుగురమ్మలైన కాళికామాత, తుల్జాభవాని, మేరమ్మ, జగదాంబమాత, సీతమ్మమాత, మంత్రల్‌మాత, హింగ్లాజ్‌మాత పేరిట ఏడు రాళ్లను ప్రతిష్ఠిస్తారు. జాజురంగుతో అలంకరిస్తారు. పెళ్లి కాని యువతులు, మహిళలు ప్రత్యేక వేషధారణలో నైవేద్యం తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. చల్లంగా చూడాలని వేడుకుంటారు. పాడి పంటలు, పశు సంపద వృద్ధి చెందాలని కోరుకుంటారు. తండాల పెద్దలు గొర్రెలు, మేకలు, కోళ్లను బలిస్తారు. గొర్రెలు, మేకల పేగులను పొడవునా పెట్టి వాటి పైనుంచి పశువులు, గొర్రెలు, మేకలను దాటిస్తారు. అలా దాటితే పశువులకు ఏ వ్యాధులు ప్రబలవని గిరిజనుల విశ్వాసం. సంప్రదాయ దుస్తుల్లో డప్పుచప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తారు. గిరిజన పాటలు పాడుతూ సాయంత్రం వరకు అడవిలోనే గడుపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేస్తారు. ప్రకృతిని ఆరాధించే సంస్కృతి అనాధిగా వస్తోందని గిరిజనులు పేర్కొంటున్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు(ఫైల్)

భక్తిశ్రద్ధలలో వేడుకలు



- భూక్య శంకర్‌నాయక్, గిరిజన నాయకుడు గుండారం

ఆషాడంలో వచ్చే మొదటి మంగళవారం తండాల్లో శీత్లా భవాని వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. అనాదిగా వస్తున్న ఆచారం మేరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. పిండి వంటకాలను శీత్లాభవానికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటాం.

తల్లులను కొలిస్తే కోరికలు తీరుతాయి



- గుగులోతు రజిత, గిరిజన మహిళ, అక్కపల్లి

ఏటా మా తండాల్లో శీత్లా భవాని పండుగను ఉత్సాహంగా నిర్వహిస్తాం. ఉపవాసంతో తల్లులను కొలుస్తాం. ఇంట్లో తయారు చేసిన గుగిళ్ల లాప్సీ పాయసాన్ని దేవతలకు సమర్పిస్తాం. తల్లులను కొలిస్తే కోరికలు తీరుతాయి. ఏటా పండగ నిర్వహిస్తాం. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడుతాయి.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు చేయాలి

వేములవాడ కల్చరల్, జూలై 8 : ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు చేయాలని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అధికారులకు సూచించారు. వేమలవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం సుప్రభాత సేవ వరకు ఆఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా మామిడాకుల తోరణాలు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

నేడు, రేపు హుండీల లెక్కింపు

వేములవాడ కల్చరల్, జూలై 8: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీలను మంగళ, బుధవారాల్లో లెక్కించన్నుట్లు ఆలయాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఈవో వినోద్ రెడ్డి నేతృత్వంలో అత్యంత భద్రత మధ్య ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు శీత్లా భవానీ వేడుకలు

రుద్రంగి జూలై 8: శీత్లా భవానీ వేడుకలు గిరిజనుల సంస్కృతీసంప్రదాయాకలు ప్రతీకగా నిలుస్తాయి. తెలంగాణలో పోచమ్మ బోనాల పండుగా మాదిరిగానే గిరిజనులకు శీత్లా భవాని దేవి వేడుకలు జరుపుకుంటారు. ఆషాఢంలో ఒక మంగళవారాన్ని ఈ పండుగ జరుపుకోవడానికి కేటాయిస్తారు. దేవి అనుగ్రహంతో పంటలు సమృద్ధిగా పండుతాయని, పశుసంపద అభివృద్ధి చెందుతుందని, వ్యాధులు రావని గిరిజనుల నమ్మకం. దీంతో గిరిజనులు శీత్లా భవానిని పూజిస్తారు. రుద్రంగి మండలంలోని మానాల చుట్టూ గిరిజన తండాల్లో మంగళవారం పండుగను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 8: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా డి.స్వప్న సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈడీగా పనిచేసిన డాక్టర్ వినోద్ కుమార్ కరీంనగర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ అయ్యారు. అదే శాఖలో పని చేస్తున్న స్వప్నకు ఈడీగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపు

కోనరావుపేట, జూలై 8 : క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని కోనరావుపేట మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు దేవరకొండ చారి అన్నారు. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో మూడు రోజులుగా జరిగిన కేపీఎల్ లీగ్ మ్యాచ్‌లో కోనరావుపేట జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా బహుమతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

రాయికల్, జూలై 8: మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో సోమ వారం షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో బాలికల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై, బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా, అసాంఘీకం గా ప్రవర్తించినట్లయితే పోలీస్ శాఖ ఊరుకోదని, వారిని శిక్షిస్తుందని తెలియ జేశారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసినవారితోనే వేధింపులకు గురవుతున్నారని, జాగ్రత్తగా ఉండాలి తప్ప అధైర్యపడవ్వని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. మహిళల పట్ల జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తె లిపారు. ఏదైనా సమస్యలు ఎదురైతే షీ టీమ్ నెంబర్ 87126 70783ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్‌ఛార్జి వలీ బేగ్, మహిళా కానిస్టేబుల్ సౌజన్య, పూజిత, పోలీస్ కళాబృందం సభ్యులు కమల్, గడ్డం రమేష్, హన్మంతు, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలి



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రై, జూలై 8: పోలీసు అధికారులు, సిబ్బందినడక, వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలోఅత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ పోలీసు అధికారి శారీరక వ్యాయామంపై దృష్టి సారించాలన్నారు. శారీరకంగా దృఢంగా ఉన్నపుడే విధులు సక్రమంగా నిర్వహించగలరన్నారు. ఇందులో భాగంగానే జిల్లా పోలీసు అధికారులకు జిమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. నిత్యం శాంతిభద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే సిబ్బంది విధులతోపాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, సీఐలు కృష్ణ, మొగిలి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మేడం వెళ్లొద్దు.. మీరే మాకు పాఠాలు చెప్పాలి



హెచ్ఎంను వెళ్లవద్దని కోరుతున్న విద్యార్థులు

ముస్తాబాద్, జూలై 8: బదిలీపై వెళ్తున్న టీచర్‌ను వెళ్లొందంటూ విద్యార్థులు టీచర్‌ను కోరారు. 'ప్లీజ్ మేడం.. మీరే మాకు పాఠాలు చెప్పాలి' అంటూ కంటతడిపెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఓరగంటి పద్మకళ ఆరేళ్లకుపైగా చిన్నారులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా వారం రోజుల క్రితం ఇదే మండలంలోని నామాపూర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను కలిసేందుకు వచ్చారు. దీంతో పాఠశాలలోని ఐదో తరగతి విద్యార్థులు వెంటనే ఆమె వద్దకు చేరుకున్నారు. ఆమెతో ముచ్చటించారు. తిరిగి వెళ్లేప్పుడు వెనకాలే వచ్చిన విద్యార్థులు 'ప్లీజ్ మేడం.. వెళ్లొద్దు.. మీరు మాకు ఇక్కడే పాఠాలు చెప్పాలి' అంటూ ఆమెను చుట్టుముట్టారు. దాదాపు ఆరేళ్లకుపైగా విద్యార్థులతో పెనవేసుకున్న బంధం ఇటు విద్యార్థులకు, అటు ప్రధానోపాధ్యాయిని పద్మకళకు కంట నీరు తెప్పించింది. మరోవైపు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆమె కృషి అభిందనీయమని తల్లిందండ్రులు పేర్కొంటున్నారు.

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఆసాములు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 8: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలని, మరమగ్గాల పరిశ్రమలకు రద్దు చేసిన విద్యుత్ సబ్సిడీని తిరిగి అందించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ కోరారు. ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లు లేక సంక్షోభంలో కూరుకపోయింది, పరిశ్రమలు మూతపడడంతో ఏడు నెలల నుంచి ఉపాధిలేక ఆసాములు, కార్మికులు, ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధి లేకపోవడంతో సిరిసిల్లలో ఇప్పటి వరకు 12 మంది కార్మికులు కుటుంబ పోషణ కరువై ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఆసాములు, కార్మికులకు ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించి సబ్సిడీతో కూడిన కరెంట్‌ను అందించాలని కోరారు. ఆసాములు చేరాల అశోక్, వడ్డెపల్లి కృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, మండల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 8: ప్రజల సమస్యలను పరిష్కరించడంతోపాటు పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పట్టాలను అందించాలని, లేకుంటే ఈ నెల 15 నుంచి ఉద్యమాలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్‌రూంలను వెంటనే అర్హులైన వాళ్లకు అందించాలని కోరారు. సిరిసిల్లలోని శాంతి నగర్‌లో 200 ఇళ్లు పూర్తయినా పంపిణీ చేయడం లేదని, దీంతో దెబ్బతింటున్నాయని, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయని ఆరోపించారు. వెంటనే వాటిని పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు. పంపిణీ చేసిన డబల్ బెడ్ రూం ఇళ్లలో చాలామంది నివాసం ఉండడం లేదని, కొంతమంది విక్రయిస్తున్నారని అన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులతో సర్వే నిర్వహించి అనర్హులను తొలగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకం అందరికీ వర్తింపజేయాలన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, జవ్వాజి విమల, సురం పద్మ, అన్నదాస్ గణేష్ పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల క్రైం, జూలై 8: అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్య తీసుకోవాలని సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి వెంకటి డిమాండ్ చేశారు. ఎస్సై మృతిపై సోమవారం సిరిసిల్లలో న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చివరకు దళిత ఉద్యోగులకు న్యాయం జరుగక ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు ఏర్పడుతున్నాయన్నారు. తీవ్ర పని ఒత్తిడి, ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేకనే ఎస్సై శ్రీనివాస్ మృతిచెందారన్నారు. ఎస్సై మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం అందజేయాలని కోరారు. . న్యాయవాది నర్మెట్ట రమేశ్ మాట్లాడుతూ ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంకని మురళి, వాతపు మౌళి, కడగండ్ల తిరుపతి, బర్ల శ్రీనివాస్, కొలపురం మహెందర్, కొమ్ము కృష్ణ, రాజేశ్, శంకర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

గంభీరావుపేట, జూలై 8 : గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ సమీపాన ఓ వ్యవసాయ భూమిలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడగా నర్మాలకు చెందిన దండ్ల శ్రీనివాస్ (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మాల గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ భూమిలో బండ రాళ్లను తొలగించేందుకు నామాపూర్‌కు చెందిన ట్రాక్టర్‌ను మాట్లాడాడు. రైతు భూమిలో బండ రాళ్లను తొలగిస్తుండగా దండ్ల శ్రీనివాస్ ట్రాక్టర్‌తో తనకు అవసరం ఉందని సమీప బంధువైన ట్రాక్టర్ యజమాని అడిగాడు. దీంతో ట్రాక్టర్‌ను తీసుకెళ్లే క్రమంలో వ్యవసాయ భూమిలో ప్రమాద వశాత్తు బోల్తా పడింది. దీంతో దండ్ల శ్రీనివాస్ ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై ఎస్సై రాంమోహన్ కోరగా సంఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సిరిసిల్ల టౌన్, జూలై 8: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్ చౌరస్తాలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంక్ వైస్ ఛైర్మన్ అడ్డగట్ల మురళి, కౌన్సిలర్ రెడ్డినాయక్ అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కౌన్సిలర్‌లు మడుపు శ్రీదేవి వెంగళ లక్ష్మీనర్సయ్య, పోలీస్ వార్డు ఆఫీసర్ రవి. కానిస్టేబుల్స్ నాగరాజు, పుల్కం శీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వేములవాడ రూరల్, జూలై 8: విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మరాజం అన్నారు. మర్రిపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాల ఆవరణలను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు. ఆయన వెంట పాఠశాల ఎస్ఓ శకుంతల తదితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

జగిత్యాల టౌన్, జూలై 8: అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న యావర్ రోడ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. రహదారుల పైకి వచ్చి వ్యాపారం చేయవద్దని కోరారు. పండ్ల వ్యాపారు లతో పాటు తోపుడు బండ్ల నిర్వాహకులుమున్సిపల్ స్థలాల్లో నిబంధనల మేరకు క్రయ, విక్రయాలు జరుపాలన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న రహదారుల ప్రక్కన ఉన్న స్థలాలను ఆక్రమించుకని అద్దెలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసకుంటామన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్, తేజస్విని ఉన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 8: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాయి. సోమవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు, నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. వైఎస్ఆర్ బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడ్డారన్నారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, పేదలకు ఆరోగ్య శ్రీ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మాజీ కౌన్సిలర్లు వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, కత్తెర దేవదాస్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ బైరి ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్‌బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నీలి రవీందర్, నాయకులు తాటికొండ శ్రీనివాస్, గౌతమ్, సదానందం, నాగరాజు, కమలాకర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటి, నాయకులు కర్ణాకర్‌రెడ్డి, కంకటి ప్రభాకర్, ఎల్లారెడ్డి, చంద్రమౌళి, మల్లయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, పార్టీ జిల్లా నాయకులు కొమిరిశెట్టి తిరుపతి, రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు లచ్చయ్య, నర్సింలు, జంగం రాజు, గౌరీ శంకర్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, దేవయ్య, బుచ్చాగౌడ్, రాములు, మల్లేశం, రాజేశం, కృష్ణమూర్తి, బాల్‌రెడ్డి, చందు, రాజుకుమార్, తిరుపతిగౌడ్, బాలయ్య శ్రీపాల్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలు వేసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, పెద్దూరు తిరుపతి, మచ్చ శ్రీనివాస్, నేరెళ్ల నర్సింగం గౌడ్, బైరినేని రాము, ఒకసారి బాలరాజ్, చుక్క శేఖర్, గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, గూడెం తదితర గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజీవ్‌కూడలిలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో వైఎస్సాఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లాకార్యదర్శి కొండం రాజిరెడ్డి, మిరియాల్‌కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, ఆగుళ్ల రాజేశం, కరెడ్ల రాజేశం, తాళ్ల విజయ్‌రెడ్డి, తలారి నర్సయ్యకొప్పు రమేశ్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో మాజీ సీఎం వైఎస్సార్ జయంతిని కాంగ్రెస్ నాయకులు సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య, దారం చంద్రం, దెబ్బటి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, దర్శ మల్లేశం, మాడిశెట్టి అభిలాష్, స్వర్గం పరంధామ్, రాజలింగం పాల్గొన్నారు.

● రుద్రంగి మండలం మానాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, వంశీ, మోహన్,లక్ష్మణ్, రవీందర్ పాల్గొన్నారు.